## క్లుప్తంగా


### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. జాన్‌పాక, నర్సంపేట రోడ్డు, కోటగండి ప్రాంతాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### నేడు బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ సమావేశం

హన్మకొండ: బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఈనెల 19న నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సమావేశం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు హాజరవుతారని, పార్టీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అనుబంధ సంఘాల నాయకులు, పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

### ఎన్నికల నోటీసు ప్రదర్శన



వరంగల్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నోటీసు ఫారం -1ను బల్దియా ప్రధాన కార్యాలయంలోని నోటీసు బోర్డుపై గురువారం ప్రదర్శించారు. నోటీసు బోర్డు వివరాలను పరిశీలించి ఎన్నికల నిబంధనలను అమలుకు ప్రతిఒక్కరూ సహకరించాలని అడిషనల్ కమిషనర్ రషీద్ కోరారు.

### కార్పొరేట్ కళాశాలలపై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి: వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్య తీసుకోవాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల్లో జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహించవద్దని, ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటే చర్యలు ఉంటాయిని ఇంటర్‌బోర్డు అధికారులు ఇప్పటికే ప్రకటించినప్పటికీ హనుమకొండలో పలు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు వేసవిలో తరగతులు కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు హనుమకొండ డీఐఈఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని తెలిపారు.

### పేదల సమస్యలపై పట్టింపేది?



నయీంనగర్: పేదల సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదని, తనకు ఒక అవకాశం ఇస్తే పార్లమెంట్‌లో పేదల సమస్యలపై గళమెత్తుతానని వరంగల్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి, తెలంగాణ చిందు హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం చిరంజీవి అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో చిరంజీవి మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ పరిధిలోని నిరుపేదల ఓట్లతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వారసత్వం పేరుతో ఉన్నత పదవులు అనుభవిస్తున్న వారిని నమ్మవద్దని సూచించారు. ప్రజలు తనకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో గడ్డం హరిబాబు, గడ్డం మధుబాబు పాల్గొన్నారు.

### 'రాముడి పేరుతో ఓట్లకు వస్తున్న బీజేపీ'

మడికొండ: బీజేపీ.. రాముడి పేరు చెప్పుకుంటూ ఓట్లు దండుకోవడానికి వస్తోందని పరకాల ఎమ్మెల్యే, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం కాజీపేట మండలం మడికొండలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని, అనంతరం మడికొండలో జరిగే పార్టీ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతారని పేర్కొన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ.. తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. హిందూవాదం, రాముడు అంటూ ఓట్లు దండుకోవడానికి తప్ప వారు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రతిపక్షాలపై ఈడీ, ఐటీ దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, శ్రీనివాస్, స్థానిక నాయకులు రాజేందర్, లింగమూర్తి, సాయిలు, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సీఎం సభా ఏర్పాట్లను సీపీ అంబర్ కిషోర్ ఝూ పరిశీలించారు. బందోబస్తుపై సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు.

# వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



శ్రీరామ పట్టాభిషేకంలో పాల్గొన్న భక్తులు



మెట్టుగుట్టపై పూజలు చేస్తున్న అర్చకులు

కాజీపేట: 62వ డివిజన్ విష్ణుపురిలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలో శ్రీరామ పట్టాభిషేకాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. 28 ఏళ్లుగా ఆలయంలో సీతారామ కల్యాణ వేడుకలు ముగిసిన మరునాడు రాముడికి పట్టాభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ వ్యవస్థాపకులు, శ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రం ఆస్థాన పండితులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో వేడుకను నిర్వహించారు. దేవతామూర్తులకు కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ – రమ దంపతులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు**

మడికొండ: శ్రీరామ నవమి ఉత్సవాలు, నవరోత్సవాల్లో భాగంగా మెట్టుగుట్టపై గురువారం ఉదయం హోమం, బలిహరణ, వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు నిత్యహోమం, బలిహరణం జరిపించారు. స్వామివారి నాగవెల్లి రథోత్సవం సందర్భంగా స్వామివారికి 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహణాధికారి శేషభారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

# సఖి సేవలను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నయీంనగర్: బాధిత మహిళలు, బాలికలు సఖి కేంద్రం సేవలను వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, డీహెచ్ఈడబ్ల్యూ స్వర్ణలత తెలిపారు. 6వ డివిజన్ బొక్కలగడ్డ అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళా అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, సర్వోదయ యూత్ ఆర్గనేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలో సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. వరకట్న వేధింపులు, ఆడపిల్ల వద్దని గర్భవిచ్ఛిత్తి వేధింపులు, విడిపోయే భార్యాభర్తలను కలపడానికి కౌన్సెలింగ్, ఇతర వేధింపులతో మానసికంగా కృంగిపోయే మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడం కోసం సఖి సెంటర్ కృషి చేస్తోందని తెలిపారు. బాధితులకు ఉచిత న్యాయ, పోలీస్, వైద్య సహాయం, తాత్కాలిక వసతి అందిస్తున్నట్లు చెప్పారు. మహిళలు, బాలికలకు ఆపద ఎదురైతే 0870 – 2452112, టోల్‌ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వి.వినీల, అంగన్‌వాడీ టీచర్ అరుణోదయ పాల్గొన్నారు.

### 'మూగ' రోదన

- యజమాని మృతితో అన్నపానీయాలు ముట్టుకోని శునకం



వహీద్ అలీ సమాధిపై తిరుగాడుతున్న కుక్కపిల్ల

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌కు చెందిన సయ్యద్ వహీద్ అలీ సమాధిపై ఓ పెంపుడు కుక్కపిల్ల గురువారం తిరుగాడుతూ అరుస్తూ ఉండడం చూపరుల హృదయాలను కలచివేయడంతో పాటు కన్నీళ్లు పెట్టించింది. బాబన్న కుమారుడు వహీద్ ఈనెల 9వ తేదీ రాత్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. సిజ్జు జాతికి చెందిన చిన్న కుక్కపిల్లను తెచ్చుకున్న వహీద్.. దాన్ని ఉదయం, సాయంత్రం వేళల్లో ఆడిస్తూ ఉండేవాడు. తన ఆలనాపాలన చూసిన యజమాని ఇంటిలో కనిపించకపోవడంతో ఆందోళన చెందిన ఆ కుక్కపిల్ల పదిరోజులుగా తిండితిప్పలు మాని విరామం లేకుండా అరుస్తూ ఆరుబయటకు పరుగెత్తడం చేస్తోంది. దాని బాధను చూడలేకపోయిన వహీద్‌ను సమాధి చేసిన కబ్రిస్థాన్‌కు తీసుకెళ్లారు. వహీద్ సమాధిపై ఆ కుక్క అటుఇటు తిరుగుతూ కాళ్లతో మట్టిని తవ్వుతూ అరుస్తుండడం చూసిన వారు ఆశ్చర్య చకితులయ్యారు. గంటకుపైగా సమాధి వద్ద దాన్ని తిప్పి తిరిగి ఇంటికి తీసుకురావడంతో పదిరోజుల పాటు నానా యాగి చేసిన ఆ కుక్కపిల్ల ఆహారం తీసుకోవడం చూసి కుటుంబ సభ్యులు చలించిపోయారు.

# పిల్లలకు ఆటపాటలతో బోధించాలి



పిల్లలకు బుక్స్ అందజేస్తున్న సీడీపీఓ విశ్వజ

ఖిలా వరంగల్: పిల్లలకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను బోధించాలని వరంగల్ జిల్లా సీడీపీఓ విశ్వజ సూచించారు. ఈసీసీఈ డే సందర్భంగా వరంగల్ ఫోర్ట్‌రోడ్డు విద్యానగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో సూపర్‌వైజర్ ఎం.రమాదేవి ఆధ్వర్యంలో పూర్వ ప్రాథమిక విద్యాబోధనపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ రెండున్నర ఏళ్ల నుంచి ఆరు ఏళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన చేయాలని చెప్పారు. అలాగే, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని వివరించారు. అనంతరం విద్యలో రాణించిన చిన్నారులకు ప్రశంస పత్రాలు, బుక్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శశికళ, సంధ్య, సుకన్య, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ, అగ్ని ప్రమాదాలపై అవగాహన



సిబ్బందికి సూచనలిస్తున్న శివకుమార్



కాశిబుగ్గ: అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: సిబ్బందికి వడదెబ్బపై ఉమ్మడి వరంగల్ జిల్లా 108 అంబులెన్స్ ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో గురువారం డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎండ తీవ్రత ఎక్కువ ఉండబోతున్న క్రమంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో వడదెబ్బలు, అతిసారం కేసులు ఎక్కువ వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కనీసం రోజుకు నాలుగు లీటర్ల నీటిని తీసుకోవాలని అన్నారు. పండ్ల రసాలు, మజ్జిగ ఎక్కువగా తాగాలని చెప్పారు. అతి చల్లటి పానీయాలను తీసుకోకూడదని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**అగ్ని ప్రమాదాలపై..**

కాశిబుగ్గ: అగ్ని ప్రమాదాలపై వరంగల్ అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కీర్తినగర్ జయ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో అగ్ని ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ అధికారి రవీందర్ మాట్లాడుతూ షాపులు, ఏజెన్సీలు నిర్వహించేవారు ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

### 26న 'వాగ్దేవి'లో మంత్ర -2కే24

హన్మకొండ: హనుమకొండ వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 26న మంత్ర -2కే24 పేరుతో జాతీయ స్థాయి ఎంబీఏ విద్యార్థుల సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ఎంబీఏ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి, విభాగం అధిపతి డాక్టర్ ఎస్.మహేందర్ కుమార్ తెలిపారు. ఈమేరకు కళాశాలలో మంత్ర -2కే24 వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సీహెచ్.దేవేందర్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ వాహినీదేవి, రిటైర్డ్ డీజీపీ డాక్టర్ ఆదిత్య ఆర్య, ప్రిన్సిపాల్ శేషాచలం, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ అచ్చయ్య, ఎంబీఏ అధ్యాపకులు పి.సుగుణాకర్ రెడ్డి, కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

# గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



టీకా వేస్తున్న మంజువాణి

హన్మకొండ: గాలికుంటు వ్యాధి రాకుండా నివారణ చర్యల్లో భాగంగా పశువులకు టీకాలు వేయించాలని పశు వైద్య, పశు సంవర్ధక శాఖ సంచాలకురాలు డాక్టర్ మంజువాణి సూచించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పశు వైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి సోకితే అధిక జ్వరంతో పశువులు మేత తినవని, తద్వారా రోజు రోజుకు పాల ఉత్పత్తి క్షీణిస్తుందని, పాల దిగుబడి తగ్గి రైతుకు నష్టం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకట నారాయణ, వరంగల్ జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రవి కుమార్, వడ్డెపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్.ప్రవీణ్ కుమార్, సిబ్బంది రాకేష్, యాదలక్ష్మి, కొమురయ్య, ఆకేష్, వంశీ పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### రుణం పేరుతో మోసం

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని నయీంనగర్‌కు చెందిన అశ్విని అనే మహిళకు గుర్తు తెలియని వ్యక్తులు రుణం ఆశచూపి అని మోసం చేశారు. రూ.5 లక్షల రుణం కోసం కొంత మొత్తం ముందుగా చెల్లించాలని ఆమెకు సూచించారు. దీంతో సదరు మహిళ నుంచి రూ.1.88 లక్షలను దశల వారీగా తీసుకొని దుండగులు మోసం చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### వ్యక్తిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: ఓ యువతి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లోని వ్యక్తిగత సమాచారాన్ని అపహరించి డబ్బులు ఇవ్వాలని బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య గురువారం తెలిపారు. సదరు యువతిని నిందితుడు కోటేశ్వరరావు బ్లాక్ మెయిల్ చేస్తూ ఆమె నుంచి రూ.4.16 లక్షలు కాజేశాడు. యువతి ఫొటోలను మార్ఫింగ్ చేసి ఇంకా డబ్బులు కావాలని వేధిస్తుండేవాడు. అతని వేధింపులు భరించలేక బాధితురాలు ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య వివరించారు.

### డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కాజీపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ కాజీపేట పట్టణంలో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు హనుమకొండ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.విద్యాసాగర్ రావు రెండు రోజులపాటు జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు తెలిపారు. సీఐ కథనం ప్రకారం కాజీపేట ట్రాఫిక్ సిబ్బంది పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా గుండా నాగరాజు (చిట్యాల) రెండుసార్లు, వేల్పుల సతీష్ (గవిచర్ల) పట్టుబడినట్లు చెప్పారు. వారికి జైలుశిక్షను మెజిస్ట్రేట్ ఖరారు చేసినట్లు వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు.

## సంక్షిప్తంగా

### మతోన్మాదుల దాడిని ఖండిస్తున్నాం..

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులపై బుధవారం రాత్రి ఏబీవీపీ మతోన్మాదులు చేసిన దాడిని ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ కూటమి విద్యార్థి సంఘం ఎన్నికల్లో విజయం సాధించిందని, దాన్ని తట్టుకోలేక ఏబీవీపీ మతోన్మాదులు దాడులకు పాల్పడుతున్నారన్నారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షుడు పురుషోత్తం, ఉపాధ్యక్షుడు సాయికిరణ్, బాధ్యులు జస్వంత్, పరిమణ, అనిల్, రాజ్‌కుమార్, సాయి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

### గర్వించేలా ఉద్యమం చేసిన ఘనత ఆయనదే..

కాజీపేట: సీఎం రేవంత్ రెడ్డి రాజకీయాల్లోకి రాక ముందే దేశం మొత్తం మాదిగల వైపు చూసే స్థాయిలో ఉద్యమం చేసిన ఘనత మంద కృష్ణమాదిగకే దక్కుతుందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ జాతి రాజకీయంగా ఎదగకుండా అణచివేత ధోరణితో వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించడానికి కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎ.వెంకటస్వామి, ఆర్.ఉమామహేశ్వర్, మంద స్వరాజ్, కిరణ్, రజనికుమార్, జేరిపోతుల సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

### గుడికి పంచలోహ విగ్రహాల బహూకరణ



ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని శ్రీశివశక్తి వినాయక మందిరానికి ఎన్ఆర్ఐ (ఆస్ట్రేలియా) సుంకరి దయాకర్ సీత, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడి పంచలోహ విగ్రహాలను గురువారం బహూకరించారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన ఎన్ఆర్ఐ సుంకరి దయాకర్ తండ్రి సుంకరి మల్లేశం చేతుల మీదుగా ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధి చెన్నూరు దేవేందర్‌కు విగ్రహాలను అందజేయగా, పంచలోహ విగ్రహాలను శాస్త్రీయంగా శుద్ధి చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ దాత సుంకరి మల్లేశంను కమిటీ ప్రతినిధి చెన్నూరు దేవేందర్ సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు గంధ్రాతి నవీన్, గండి నాగరాజు, గై అనిల్, బౌరిశెట్టి రాజు, తాళ్లపల్లి రమేష్, పెద్దోజు రాజేష్, పూసల సుమన్, పూసల రవి, బొల్లం భరత్ పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఓ మహిళ బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన కోట శాంతమ్మ(51) కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. చిన్న కోడెపాకలో బంధువు చావుకు శాంతమ్మ హాజరై బుధవారం సాయంత్రం తిరిగి ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై శంభునిపేట నాగమయ్య కమాన్ ఎదుట రోడ్డు దాటుతుండగా ఆమెను ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దాంతో శాంతమ్మకు తలకు తీవ్ర గాయలై ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మరణించింది. మృతిరాలి కుమారుడు కోట దిలీప్‌రాజ్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

### మోడల్ ఎప్‌సెట్, నీట్ పోస్టర్ల ఆవిష్కరణ



విద్యారణ్యపురి: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఈనెల 20న మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షను హనుమకొండలో నిర్వహించబోతున్నట్లు విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్ తెలిపారు. ఈమేరకు మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్లను హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ మోడల్ పరీక్షలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, సుజాత, అవినాష్, చిట్యాల రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

# లారీ ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు

మామునూరు: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో ఓ వ్యక్తిని ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలో గురువారం జరిగింది. బాధితుడి, స్థానికుల కథనం ప్రకారం ఖిలా వరంగల్ మధ్యకోటకు చెందిన షేక్ మజీద్, సర్వర్ బేగం దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతర రాష్ట్రాల లారీలకు గైడ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని మజీద్ పోషిస్తున్నాడు. రోజు వారీగానే గురువారం ఉదయాన్నే వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని లారీ ఆఫీసుకు మజీద్ ఆటోలో బయలుదేరాడు. ఈ క్రమంలో ఆర్టీఏ జంక్షన్ సమీపంలో ఆటో దిగి రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దాంతో అతడిని తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి మామునూరు పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

# అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మడికొండ: పార్టీలో చేరిన సంఘం సభ్యులు

హసన్‌పర్తి: అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం నాగారానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బండారి స్వర్ణలత, మాజీ ఉపసర్పంచ్ సాంబయ్యతోపాటు పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరిక**

మడికొండ: మడికొండ వాల్మీకి సంఘం సభ్యులు.. బైరి లింగమూర్తి, కుర్ల మోహన్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే నాగరాజు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోగి కృష్ణమూర్తి, వెంకటప్రసాద్, వెంకటస్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు లింగమూర్తి, సతీష్, పేర్ల సురేష్, రవి, సత్యం, రాజపోశాలు, రవీందర్, కృష్ణ, బాలరాజు, భిక్షపతి, సాయిలు, సాంబయ్య, కుమార్, వెంకటయ్య, యాదగిరి, ఉప్పలయ్య, వెంకటస్వామి, కృష్ణ, అర్జున్, రాజు పాల్గొన్నారు.

# ప్రజలంతా బీజేపీ వైపే ఉన్నారు: అరూరి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్

హసన్‌పర్తి: ప్రజలంతా బీజేపీ వైపు ఉన్నారని భారతీయ జనతా పార్టీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి కేంద్రానికి చెందిన మత్స్యపారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, పార్లమెంటరీ ప్రభారి మురళీధర్, కార్పొరేటర్లు శివకుమార్, అభినవ్ భాస్కర్, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు రేణికుంట్ల సునీత, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్, బీజేపీ రాష్ట కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెరవాలి



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన నాయకులు

కాజీపేట: ఆరంభ శూరత్వంలా మిగిలిపోయిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే తెరిపించి, అన్నదాతలను ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్‌గౌడ్ డిమాండ్ చేశారు. కాజీపేట మండలం సోమిడి శివారులోని వరి ధాన్యం కొనుగులు కేంద్రాన్ని బీజేపీ నాయకులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సహకారం సంఘం డైరెక్టర్ కాయిత రాజ్‌కుమార్ యాదవ్‌తో కలిసి నర్సింగ్ మాట్లాడుతూ ఏప్రిల్ 1న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు.. నేటికి ఒక బస్తా ధాన్యాన్ని కూడా అన్నదాతల నుంచి సేకరించకపోవడం బాధాకరమని వాపోయారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో వరి ధాన్యం కొనుగోలు చేయాలని, లేకుంటే అన్నదాతలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మేకల శ్రావణ్ కుమార్ యాదవ్, శివ, వీరేందర్, జంపయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాలస్వామి ఆలయ, అభివృద్ధి కమిటీల ఎన్నిక



ఎన్నికైన ఆలయ, అభివృద్ధి కమిటీల కార్యవర్గం

మడికొండ: మడికొండలోని వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ, ఆలయ అభివృద్ధి కమిటీలను గురువారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా కల్లెపు నరేష్, ఉపాధ్యక్షుడిగా దువ్వ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గుడుగుల కుమార్, సంయుక్త కార్యదర్శిగా నార్లగిరి సతీష్, కోశాధికారిగా కడార్ల నరేందర్, సహాయ కార్యదర్శిగా బోగి దయాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా దువ్వ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా పల్లపు అర్జున్, ప్రధాన కార్యదర్శిగా నిగ్గుల సతీష్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎండీ.రహీంపాషా, కోశాధికారిగా పత్తిపాక ఉపేంద్రచారి, ప్రచార కార్యదర్శిగా దువ్వ నవీన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు నిగ్గుల సతీష్‌కుమార్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, బైరి లింగమూర్తి, కొప్పుల నవీన్ యాదవ్, దండిగం భిక్షపతి, బజ్జూరి శ్రీనివాస్, కామిని మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.